క్లుప్తంగా

ప్లాస్టిక్ వినియోగం పర్యావరణానికి హానికరం



దెందులూరు నర్సింగ్ కళాశాలలో పేపర్ బ్యాగ్స్ డే సందర్భంగా ప్రదర్శన

దెందులూరు: ప్లాస్టిక్ బ్యాగుల వినియోగం పర్యావరణానికి ఎంతో హానికరమని దెందులూరు నర్సింగ్ కళాశాల కరస్పాండెంట్ సుగ్గిశెట్టి నూకరాజు అన్నారు. శుక్రవారం దెందులూరు నర్సింగ్ కళాశాలలో నేషనల్ పేపర్ బ్యాగ్స్ డే నిర్వహించారు. ప్లాస్టిక్ సంచులు భూముల్లోనే ఉండటం వల్ల నేల, నీరు కలుషితమవుతుందన్నారు. వీటికి బదులుగా కాగితపు సంచులు వినియోగించాలన్నారు. కాగిత సంచులు రీసైక్లింగ్ ద్వారా మళ్లీ పునర్వినియోగానికి ఉపయోగపడతాయని తెలిపారు. కాగితం భూమిలో త్వరగా కలిసిపోతుందని వివరించారు. ఈ సందర్భంగా విద్యార్థులు పేపర్లతో సంచులను తయారు చేసి నమూనాలను ప్రదర్శించి ఆకట్టుకున్నారు.

ట్రిపుల్ ఐటీకి ఎంపిక



విద్యార్థులను అభినందిస్తున్న వివేకానంద జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్ఎం

ఉంగుటూరు: వివేకానంద జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ట్రిపుల్ ఐటీకి ఎంపికయ్యారు. పాఠశాలలో 2023–24 విద్యా సంవత్సరంలో 10వ తరగతి చదివిన విద్యార్థులు గోపిశెట్టి రవితేజ, పొన్నాడ పవన్, నక్కాబాల శివసాయి, పాలపర్తి సూర్య దీపికలు ట్రిపుల్ ఐటీలో సీట్లు సాధించినట్లు పాఠశాల హెచ్ఎం తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను హెచ్ఎంతో పాటు, ఉపాధ్యాయులు, సహ విద్యార్థులు, సిబ్బంది తదితరులు అభినందించారు.

మానవత ఆర్థిక సాయం

పెదపాడు: అప్పనవీడుకు చెందిన మానవత శాఖ ప్రతినిధులు ఓ తాపీ కార్మికునికి ఆర్థిక సాయం అందించారు. కూలిపనికి ఆటోలో వెళ్తున్న శ్రీనివాసరావు ప్రమాదానికి గురై కాలికి తీవ్ర గాయాలు కావడంతో చికిత్స పొందుతున్నాడు. దీంతో మానత రాష్ట్ర కన్వీనర్ మారుబోయిన కోటేశ్వరరావు సభ్యులతో కలిసి వెళ్లి సంస్థ తరపున రూ.5వేలు, సభ్యులు 3,500 ఆర్థిక సాయం అందించారు. ఈ కార్యక్రమంలో మానవత సభ్యుడు గూడపాటి జయరామచంద్రరావు, నారగాని కొండలరావు, వేగిరెడ్డి సూర్యనారాయణ, వడ్డి రాజేశ్వరరావు, సుభాచారి, పీవీ చలం, దయాల ప్రభాకరరావు, జన్యావుల సత్యనారాయణ పాల్గొన్నారు.

డ్రెయినేజీల పరిశీలన



కొక్కిరపాడులో డ్రెయినేజీలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్

పెదపాడు: డ్రెయినేజీలను అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ గ్రామ పంచాయతీ అధికారులను ఆదేశించారు. మండలంలోని కొక్కిరపాడులో శుక్రవారం ఆయన పర్యటించి రహదారులను, డ్రెయినేజీలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, గ్రామ పంచాయతీ అధికారులు పాల్గొన్నారు.

అవినీతిపై చర్యలు తీసుకోవాలి

ఏలూరు (టూటౌన్): పోణంగి కంపోస్టు యార్డు పనుల పేరుతో జరిగిన అవినీతిపై చర్యలు తీసుకోవాలని సీపీఎం ఏలూరు నగర కార్యదర్శి పి.కిషోర్ డిమాండ్ చేశారు. స్థానిక పవర్‌పేటలోని సీపీఎం కార్యాలయంలో ఏలూరు నగర కమిటీ సమావేశం శుక్రవారం నిర్వహించారు. కిషోర్ మాట్లాడుతూ కార్పొరేషన్‌లో ప్రజాధనం దుర్వినియోగం కాకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సమావేశంలో పార్టీ నగర కమిటీ సభ్యులు వి.సాయిబాబు, బి.జగన్నాథరావు, కె.రామాంజనేయులు, వీవీవీఎస్ ప్రసాద్, జి.రవి కిషోర్, వైఎస్ కనకారావు, ఎం అరుణకుమారి తదితరులు పాల్గొన్నారు.

దెందులూరు ఉప సర్పంచ్‌గా బర్ణనాల అప్పారావు

దెందులూరు: దెందులూరు ఉప సర్పంచ్‌గా, 3వ వార్డు మెంబరు బర్ణనాల అప్పారావు శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఇప్పటి వరకు ఉప సర్పంచ్‌గా ఉన్న మురళి రాజీనామా చేయడంతో శుక్రవారం దెందులూరు గ్రామ పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ తోట ఏసమ్మ అధ్యక్షతన ఉప సర్పంచ్ ఎన్నిక జరిగింది. ఈ కార్యక్రమంలో టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జి గారపాటి కొండయ్య చౌదరి, సర్పంచ్ తోట ఏసమ్మ, ఎంపీటీసీ పెనుబోయిన శేషారత్నం, టీడీపీ నాయకులు మహేష్, ఇప్పిలి వెంకటేశ్వరరావు, జహీర్, గ్రామ కార్యదర్శి విజయలక్ష్మి, వీఎస్ చౌదరి తదితరులు అభినందించారు.

అన్నదాతలకు అండగా అగ్రి ల్యాబ్

- వ్యవసాయ, పశుగణాభివృద్ధికి దోహదం
- ఉచితంగా పశు సంరక్షణకు అవసరమైన పరీక్షలు
- డాక్టర్ వైఎస్సార్ అగ్రి టెస్టింగ్ ల్యాబ్‌లతో నకిలీ విత్తనాలకు చెక్



గోపన్నపాలెంలోని అగ్రి టెస్టింగ్ ల్యాబ్



అగ్రి టెస్టింగ్ ల్యాబ్‌లో పరీక్షలు చేస్తున్న దృశ్యం

దెందులూరు: వ్యవసాయ రైతులకు, పశు పెంపకందారులకు డాక్టర్ వైఎస్సార్ అగ్రిటెస్టింగ్ ల్యాబ్ సెంటర్ సేవలందిస్తోంది. రైతులకు ప్రధాన వనరుగా ఉండే పశువుల సంరక్షణకు అగ్రి టెస్టింగ్ ల్యాబ్ సేవలు నిర్వహిస్తూ రైతుల మన్ననలను పొందుతోంది. రైతుల అవసరాలకు అనుగుణంగా వ్యవసాయ పరీక్షలు సైతం నిర్వహిస్తున్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పడిన తరువాత దెందులూరు నియోజకవర్గంలో గోపన్నపాలెంలో మాజీ ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి కృషితో అగ్రి టెస్టింగ్ ల్యాబ్ మంజూరైంది.

అగ్రి ల్యాబ్‌లో సేవలు ఇలా

అగ్రి టెస్టింగ్ ల్యాబ్ ద్వారా విత్తనాలు, ఎరువులు, పురుగు మందుల నాణ్యత, పరీక్షలు నిర్వహించడంతో పాటు పశువులకు సంబంధించిన రక్తపరీక్షలు, యూరిన్, పేడ, సీరం, స్కిన్, టెస్టులతో పాటు పాల సాంద్రతతో సహా అనేక రకాల పరీక్షలు నిర్వహిస్తారు. నకిలీ విత్తనాలు, నకిలీ పురుగు మందుల బెడద లేకుండా సుమారు గతేడాది నుంచి రైతులు తమ పంటలను నాణ్యమైన రీతిలో ఉత్పత్తి చేసుకోగలుగుతున్నారు. అదే విధంగా నియోజకవర్గంలో పెదపాడు, పెదవేగి, దెందులూరు, ఏలూరు రూరల్ మండలాల్లో పశువుల పెంపకందారులకు, రైతులకు అగ్రి టెస్టింగ్ ల్యాబ్ వల్ల కలిగే ఉపయోగాలతో తాము ఆర్థికంగా నిలదొక్కుకోగలిగామని లబ్ధిదారులు సంతోషం వ్యక్తం చేశారు. ప్రతి మూడు నుంచి ఆరు నెలలకొకసారి భూసార పరీక్షలతో పాటు పశు పరీక్షలు నిర్వహించుకునే విధంగా లబ్ధిదారులకు అవగాహన కల్పిస్తున్నట్లు వ్యవసాయ శాఖ, పశుసంవర్ధక శాఖ అధికారులు వివరించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పశు సంరక్షణ కోసం ప్రవేశపెట్టిన 1962 కాల్ సెంటర్ ద్వారా సకాలంలో పశువులకు అంబులెన్స్ పంపించడంతో పాటు వాటికి సకాలంలో ఆరోగ్య సేవలందించే గోవర్ధినిగా మారిందని రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. పశు, వ్యవసాయశాఖ సిబ్బందిని ల్యాబ్‌లో కలిసి నమూనాలు తీసుకువస్తే పరీక్షలు నిర్వహించి రిపోర్టులు అందజేస్తూ పంటల భూమి, పశువులకు సంబంధించి రక్షిత సౌకర్యాల సలహాలు సూచనలు ఇస్తారని తెలిపారు. అవసరమైతే వాటిని జిల్లా కేంద్రమైన ఏలూరులో టెస్టింగ్ ల్యాబ్‌కు పంపించడంతో పాటు రిపోర్టులను అందజేస్తారని టెస్టింగ్ ల్యాబ్ సిబ్బంది చెబుతున్నారు.

ల్యాబ్‌లో నిర్వహించిన పరీక్షలు	
పేడ పరీక్షలు	1,501
రక్త పరీక్షలు	311
రక్తగణన పరీక్షలు	462
పాల పరీక్షలు	38
నాసికా స్రావ పరీక్షలు	29
చర్మ పరీక్షలు	36
గర్భకోశ పరీక్షలు	39

నకిలీ బెడద తప్పింది



వరి వంగడాల్లో గతంలో కల్తీ విత్తనాలు, మొక్కజొన్నలో నకిలీ విత్తనాలు రావడంతో రైతులు తీవ్రంగా నష్టపోయేవారు. అగ్రి ల్యాబ్ ఏర్పాటు చేసినప్పటి నుంచి విత్తనాల నకిలీల బెడద తప్పింది. రైతులకు మేలు కలుగుతోంది. దీంతోపాటు పశుపోషకులకు కూడా ల్యాబ్‌ల ద్వారా ఉత్తమ సేవలందుతున్నాయి. గత ప్రభుత్వంలో ల్యాబ్‌ల ద్వారా సత్వర సేవలందేవి.

– కొండేటి గంగాధరబాబు

స్ఫూర్తిదాయకంగా సేవలు



దెందులూరు నియోజకవర్గంలో మనుషులతో పాటు పశువులకు వాటి భద్రత, ఆరోగ్య పరిరక్షణ, వ్యవసాయం సంరక్షణ, అభివృద్ధి లక్ష్యాలుగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం గొప్పగా ఆలోచించి అగ్రి ల్యాబ్‌లు నియోకజవర్గానికి ఒకటి ఏర్పాటు చేసి సేవలందించేలా చర్యలు తీసుకున్నారు. వ్యవసాయాభివృద్ధికి దోహదపడే గత ప్రభుత్వ నిర్ణయాలు స్ఫూర్తిదాయకం.

– కోటే నాగమల్లేశ్వరికుమార్, సర్పంచ్, గోపన్నపాలెం

ఆయిల్‌పామ్ సాగు అభివృద్ధికి సహకరించండి

దెందులూరు: దెందులూరు నియోజకవర్గం పూర్తిగా వ్యవసాయ ఆధారిత ప్రాంతమని రెండవ పంటగా ఈ నియోజకవర్గంలో రైతులు ఆయిల్‌పామ్ సాగు చేస్తున్నారని ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ యాదవ్‌కు బీజేపీ దెందులూరు మండల అధ్యక్షుడు బుజ్జి గోపాల్ వినతి పత్రం అందజేశారు. ఆయిల్‌పామ్ సాగులో సమస్యల పరిష్కారం, ప్రోత్సాహకరమైన రేటు, రవాణాపరమైన అన్ని సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని లేఖలో కోరారు. ఎంపీ సానుకూలంగా స్పందించారని గోపాల్ తెలిపారు.

కొనసాగుతున్న సీపీఎఫ్ ఉద్యోగుల ఆందోళన

గణపవరం: గణపవరంలో మూతపడిన సీపీఎఫ్ కంపెనీలో పర్మినెంట్ ఉద్యోగులుగా పనిచేస్తున్న తమకు న్యాయం జరిగే వరకూ ఆందోళన కొనసాగుతుందని ఉద్యోగ సంఘాల పోరాట సమితి ప్రకటించింది. గణపవరం సీపీఎఫ్ ఫ్యాక్టరీ వద్ద కంపెనీ పర్మినెంట్ ఉద్యోగులు 34వ రోజు తమ ఆందోళన కొనసాగించారు. శుక్రవారం కంపెనీలో పనిచేస్తున్న పర్మినెంట్ ఉద్యోగులతో పాటు మహిళా ఉద్యోగులు ఆందోళనలో పాల్గొన్నారు.

మోదీకి అత్యున్నత పురస్కారంపై హర్షం

దెందులూరు: భారత ప్రధాని నరేంద్ర మోదీకి రష్యా అత్యున్నత పురస్కారం అందించడం దేశానికి గర్వకారణమని బీజేపీ రాష్ట్ర కార్యదర్శి గారపాటి సీతా రామాంజనేయచౌదరి, రైల్వే బోర్డు మెంబరు గుమ్మడి చైతన్యకృష్ణ, బీజేపీ దెందులూరు మండల అధ్యక్షుడు బుజ్జి గోపాల్ హర్షం వ్యక్తం చేశారు. శుక్రవారం వారు మాట్లాడుతూ రష్యా దేశపు అత్యున్నత పురస్కారం అందుకున్న భారతదేశపు తొలి వ్యక్తిగా నరేంద్ర మోదీ చరిత్ర సృష్టించారన్నారు. భవిష్యత్తులో భారతదేశానికి నరేంద్రమోదీ మరిన్ని సేవలందించాలని వారు ఆకాంక్షించారు.

అన్ని రోగాలకూ మూలం నీటి కాలుష్యం



బువ్వనపల్లి యూపీ పాఠశాలలో ఆర్వో వాటర్ ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న విర్‌బాక్ ప్రతినిధులు



ఆర్వో నీరు తాగుతున్న విద్యార్థులు

నిడమర్రు: అన్ని రోగాలకూ మూలం మంచినీటి కాలుష్యమేనని అందువల్ల ప్రతి ఒక్కరూ సురక్షితమైన నీటిని తాగాలని ప్రముఖ ఆక్వా వ్యాపారి, విర్‌బాక్ కంపెనీ ఉత్పత్తుల పంపిణీదారుడు సుజయ్‌రెడ్డి అన్నారు. నిడమర్రు మండలం బువ్వనపల్లి హైస్కూల్లో ప్రముఖ చేపలు, రొయ్యల మేతలు, మందుల తయారీ సంస్థ విర్‌బాక్ ఆర్థిక సహాయం రూ. 2లక్షల వ్యయంతో ఏర్పాటు చేసిన ఆర్వో వాటర్‌ప్లాంట్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభకు హెచ్ఎం సంకు ఏసుబాబు అధ్యక్షత వహించారు. ఈ సభలో ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు సురక్షిత నీరు అందించాలన్న లక్ష్యంతో పలు పాఠశాలల్లో ఆర్వో వాటర్ ప్లాంట్లను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. బువ్వనపల్లి బాధ్యతను తాను తీసుకుంటానని విద్యార్థుల హర్షధ్వానాల మధ్య ప్రకటించారు. విర్‌బాక్ కంపెనీ ఏబీఎం సత్యనారాయణ మాట్లాడుతూ తమ కంపెనీ లాభాల్లో కొంతభాగాన్ని సామాజిక సేవా కార్యక్రమాలకు వినియోగిస్తున్నామని తెలిపారు. ఏపీ ఏరియా మేనేజర్ సుబ్బారావు మాట్లాడుతూ విద్యార్థులు చిన్నతనం నుంచే నీటి పొదుపుపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ఈ సందర్భంగా వాటర్‌ప్లాంట్‌కు సుజయ్‌రెడ్డి స్విచ్‌ఆన్ చేయగా, సత్యనారాయణ రిబ్బన్ కత్తిరించి ప్రారంభోత్సవం చేశారు. కార్యక్రమంలో కంపెనీ స్థానిక అధికారి సీమోను, ఎస్ఎంసీ చైర్మన్ తన్నీడి వెంకటలక్ష్మి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. అనంతరం దాతలను ఉపాధ్యాయులు సత్కరించారు.

స్వచ్ఛమైన నీటి ద్వారా ఆరోగ్యం



విద్యార్థులకు ఆరోగ్య సూత్రాలపై అవగాహన కల్పిస్తున్న జిల్లా జీల్ జీవన్ మిషన్ కోఆర్డినేటర్

భీమడోలు: స్వచ్ఛమైన నీటి ద్వారానే సంపూర్ణ ఆరోగ్యవంతులవుతారని జల్‌జీవన్ మిషన్ ఆర్‌డబ్ల్యూఎస్ జిల్లా కోఆర్డినేటర్ ఏ.శ్రీనివాసరావు అన్నారు. గుండుగొలను–1 ప్రాథమిక పాఠశాలను శుక్రవారం ఆయన సందర్శించారు. డయేరియా రహిత సమాజ స్థాపనే లక్ష్యంగా గ్రామ పురవీధుల్లో చిన్నారులు, వివిధ శాఖల సిబ్బంది అవగాహన ర్యాలీ నిర్వహించారు. తొలుత పాఠశాలను సందర్శించి ఆయన పాఠశాల పరిసరాల్లో పారిశుద్ధ్య కార్యక్రమాల నిర్వహణను పరిశీలించారు. పాఠశాలలోని ఆర్వో ప్లాంట్, మరుగుదొడ్ల నిర్వహణ, విద్యార్థులు చేతులు శుభ్రం చేసుకున్న తీరు తదితర అంశాలను పరిశీలించారు. కలుషిత నీరు, ఆహారంతో రోగాల బారిన పడతామని శ్రీనివాసరావు అన్నారు. వ్యక్తిగత పరిశుభ్రత, పరిసరాల పరిశుభ్రతలను పాటించాలన్నారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు, వివిధ శాఖల సిబ్బందితో కలిసి డయేరియాను నివారిద్దామంటూ నినదిస్తూ గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఈవో మురళీ, హెచ్ఎం పాశం పాండురంగారావు, వీఆర్వో కె.శంకర్, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

ట్రిపుల్ ఐటీలకు నలుగురు ఎంపిక



ట్రిపుల్ ఐటీ సీట్లు సాధించిన విద్యార్థులను అభినందిస్తున్న హెచ్ఎం జి.సునీతా



తేజస్విని

భీమడోలు: దేశంలోనే ప్రతిష్ఠాత్మకంగా భావించే ట్రిపుల్ ఐటీల్లో మండలంలోని రెండు పాఠశాలలకు చెందిన నలుగురు విద్యార్థులు ఎంపికయ్యారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాలలకు చెందిన వీరంతా పదో తరగతి మార్కుల ఆధారంగా ట్రిపుల్ ఐటీల్లో చేరేందుకు అర్హత సాధించి తమ సత్తాను చాటారు. రాష్ట్ర వ్యాప్తంగా ఎంపికైన విద్యార్థుల వివరాలను రాష్ట్ర ఉన్నత విద్యామండలి వెల్లడించింది. అందులో గుండుగొలను జెడ్పీ హైస్కూలుకు చెందిన ముగ్గురు విద్యార్థుల్లో ఇద్దరు బాలికలు, ఒక బాలుడుతో పాటు పోలసానిపల్లి గురుకుల బాలికల పాఠశాలలోని బాలిక ప్రతిభను చాటి ట్రిపుల్ ఐటీల్లో సీట్లు సాధించారు. గుండుగొలనులోని వి.జస్వంత్ వివేక్ పదో తరగతిలో 573 మార్కులు, ఏ.ప్రీతి వర్ధిని (569) ఒంగోలు ట్రిపుల్ ఐటీకి ఎంపికయ్యారు, వి.కీర్తనాదేవి (568), పోలసానిపల్లి గురుకుల పాఠశాలలోని పెనుగొండ తేజస్విని (562) శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీలో సీట్లు సాధించారు. గుండుగొలను ఉన్నత పాఠశాలలో శుక్రవారం నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో ఎంపికైన విద్యార్థులను హెచ్ఎం జి.సునీతా అభినందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు ప్రభుత్వం ట్రిపుల్ ఐటీల్లో సీట్లు కేటాయించి వారికి బంగారు భవిష్యత్తును కల్పిస్తుందన్నారు. ట్రిపుల్ ఐటీల్లో సీట్లు సాధించిన నలుగురు విద్యార్థులను ఎంఈవో 1 ఈదుపల్లి శ్రీనివాసరావు, ఎంఈవో 2 అయినపర్తి భాస్కర్‌కుమార్ అభినందించారు.

ప్రభుత్వ పాఠశాల విద్యార్థికి విట్‌లో ఉచిత ప్రవేశం



హనుమంతు విజయరాజుకు ప్రవేశపత్రాలు అందజేస్తున్న విట్, అమరావతి ప్రతినిధులు

ఉంగుటూరు: నారాయణపురం మహాత్మాగాంధీ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థి విట్– అమరావతిలో కంప్యూటర్ సైన్సు ఇంజనీరింగ్ ఆర్టిఫీషియల్ ఇంటిలిజెన్స్ స్పెషలైజేషన్ ఉచితంగా సీటు లభించిందని కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపల్ బీవీ శ్రీనివాసు తెలిపారు. కళాశాలలో శుక్రవారం అభినందన కార్యక్రమం నిర్వహించారు. ద్వితీయ సంవత్సరం ఎంపీసీ గ్రూపు చదివిన హనుమంతు విజయరాజు రాష్ట్రస్థాయిలో 985/1000 మార్కులతో ద్వితీయ ర్యాంకు సాధించాడు. ఏలూరు జిల్లా వృత్తి విద్యాధికారి బి.ప్రభాకర్‌రావు విద్యార్థిని అభినందించారు. ప్రిన్సిపల్‌తో పాటు అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొని విద్యార్థికి అభినందనలు తెలిపారు. కళాశాలలో ఎంపీసీ, బైపీసీ, సీఈసీ కోర్సులు అందిస్తున్నామని, ఈనెల 31 వరకు అడ్మిషన్లు పొందేందుకు గడువు ఉందన్నారు. కళాశాలలో అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీకి హాజరైన విద్యార్థుల్లో ద్వితీయ సంవత్సరం 92 శాతం, ప్రథమ సంవత్సరం 80 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించినట్లు చెప్పారు.

మాదకద్రవ్యాల వినియోగంతో అన్నీ అనర్థాలే



మాట్లాడుతున్న జడ్జి నాగ రంజిత్ కుమార్

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): మాదకద్రవ్యాల వినియోగం వల్ల వ్యక్తికి శారీరక, మానసిక, సాంఘిక సమస్యలు తలెత్తుతాయని జూనియర్ సివిల్ జడ్జి పీవీ నాగ రంజిత్ కుమార్ అన్నారు. రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ, ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి సి.పురుషోత్తం కుమార్ ఆదేశాల మేరకు శుక్రవారం స్థానిక నరసింహారావుపేటలోని ఎస్‌వీఆర్‌కే కళాశాలలో మాదకద్రవ్యాలు, ర్యాగింగ్ వల్ల కలిగే దుష్ప్రభావాలపై అవగాహన సదస్సు ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా రంజిత్ కుమార్ మాట్లాడుతూ నేటి సమాజంలో విద్యార్థులపై మాదకద్రవ్యాల ప్రభావం ఎక్కువగా ఉందని, అపరిచిత వ్యక్తులతో జాగ్రత్తగా మెలగాలని, మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు. విద్యార్థులు మంచి నడవడికతో చదువుపై శ్రద్ధ చూపాలన్నారు. మాదకద్రవ్యాలతో వ్యక్తిగతంగా కుటుంబ పరంగా సామాజిక పరంగా ఎంతో నష్టం కలుగుతుందని హెచ్చరించారు. ట్రైనీ జడ్జి లక్ష్మీ లావణ్య మాట్లాడుతూ విద్యార్థులు స్నేహభావంతో మెలగాలని, తోటి విద్యార్థుల మనోభావాలు దెబ్బతినకుండా నడుచుకోవాలని సూచించారు. ర్యాగింగ్ వంటి సమస్యలు ఎదురైనప్పుడు ఉపాధ్యాయులతో, తల్లిదండ్రులతో తెలియపరచాలని, సమస్యను దాచుకోవడం వల్ల మానసికంగా కుంగిపోవాల్సి వస్తుందని తెలిపారు. ఒకసారి రాగింగ్‌కు పాల్పడిన వ్యక్తిని కళాశాల నుంచి తొలగించడమే కాకుండా చట్టం కఠినంగా శిక్షిస్తుందని హెచ్చరించారు. విద్యార్థులు చదువు పట్ల శ్రద్ధతో స్నేహభావంతో మెలగాలని సూచించారు. సదస్సులో ట్రైనీ జడ్జి ఎం రాజరాజేశ్వరి తేజస్విని పాల్గొన్నారు.

అణగారిన జాతుల అస్థిత్వాన్ని నిలబెట్టాలి

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): అణగారిన జాతుల అస్థిత్వాన్ని నిలబెట్టడానికి, లిపి లేని భాషల మౌఖిక సాహిత్యాన్ని వెలుగులోకి తీసుకురావడానికి పత్రికలు, గ్రంథాలు విరివిగా రావాల్సిన అవసరం ఉందని జిల్లా రచయితల సంఘం అధ్యక్షుడు లంకా వెంకటేశ్వర్లు పిలుపు నిచ్చారు. స్థానిక అశోక్‌నగర్‌లో శుక్రవారం బంజారా భజరంగీ భేరి సంఘం ఆధ్వర్యంలో బంజారా క్రాంతి అంతర్జాల మాస పత్రిక జూలై నెల సంచికను ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. బంజారా క్రాంతి పత్రిక సంపాదకుడు భూక్యా నాగరాజు నాయక్, బంజారా బజరంగీ భేరి సంఘ జిల్లా నాయకులు ధరావత్ శ్రీనివాస్ నాయక్‌లు మాట్లాడారు. జిల్లా రచయితల సంఘం కార్యదర్శి నాగాస్త్ర తదితరులు పాల్గొన్నారు.

ఎల్ఐసీ ప్రీమియంపై జీఎస్టీ రద్దు చేయాలి

ఏలూరు (టూటౌన్): ఎల్ఐసీ ప్రీమియంపై జీఎస్టీని రద్దు చేయాలని, ప్రభుత్వ రంగ, సాధారణ బీమా సంస్థలుగా ఉన్న నాలుగింటినీ ఒకే కంపెనీగా మార్చాలని కోరుతూ ఎల్ఐసీ ఉద్యోగుల సంఘం, ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఎంప్లాయిస్ యూనియన్ ఏలూరు బ్రాంచి ఉద్యోగులు ఎంపీ పుట్టా మహేష్ కుమార్ యాదవ్‌కు శుక్రవారం వినతి పత్రం అందజేశారు. బీమా ప్రీమియంపై 8 శాతం జీఎస్టీ విధించడం వల్ల పాలసీదారులపై భారం పడుతుందని పేర్కొన్నారు. బీమా ప్రీమియంలకు కొత్త ఆస్తి పన్ను విధానంలో ఒక ప్రత్యేక సెక్షన్ కింద మినహాయింపు ఇవ్వాలని కోరారు. ఎంపీగా సానుకూలంగా స్పందించారని నాయకులు తెలిపారు. ఎంపీని కలిసిన వారిలో రాజమండ్రి డివిజన్ ఉపాధ్యక్షులు ఐవీ సుధాకర్, వీవీ రమణ, గౌతమ్, ఆంజనేయులు, మల్లేశ్వరరావు, ఏజెంట్స్ యూనియన్ నాయకులు రాంప్రసాద్, ధనుష్యులు ఉన్నారు.

పర్యావరణానికి హాని కలిగించొద్దు



నారాయణపురంలో అధికారుల సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ధర్మరాజు

ఉంగుటూరు: పర్యావరణానికి హాని కలిగిస్తే ఉపేక్షించేది లేదని ఉంగుటూరు ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు అన్నారు. శుక్రవారం మధ్యాహ్నం నారాయణపురం లయన్సు ఆడిటోరియంలో నియోజకవర్గస్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. సమావేశానికి ఏలూరు జిల్లా పంచాయతీ అధికారి తూతిక శ్రీనివాస్ విశ్వనాథ్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ధర్మరాజు మాట్లాడుతూ రహదారుల ఆక్రమణలు, డ్రెయినేజి వ్యవస్థపై దృష్టి సారించాలన్నారు. జిల్లా పంచాయతీ అధికారి విశ్వనాథం మాట్లాడుతూ కలెక్టరు ఆదేశాల మేరకు నియోజకవర్గ సమీక్ష సమావేశం నిర్వహించామన్నారు. ప్రధానంలో సాగునీటిలో వైరస్ ఉండటంతో విదేశాలకు చేపల ఎగుమతులు నిలిచిపోయాయని అన్నారు. కోళ్ల, పశు వ్యర్థాలను చెరువుల్లో వేయటం వల్ల నీరు కలుషితమవుతోందని అన్నారు. దీనిపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ఆక్వా రైతుల సంఘం అధ్యక్షుడు విజయరాజ్ మాట్లాడుతూ సాగునీరు కలుషితం కాకుండా చూడాల్సి బాధ్యత అందరిపై ఉందన్నారు. ఈ సమావేశంలో నియోజకవర్గంలోని నాలుగుమండలాల తహసీల్దార్లు వెంకశివయ్య, వరహాలయ్య, రాంబాబు, పోసిబాబు, ఎంపీడీవోలు శర్మ, శివరామకృష్ణయ్య, సూర్యనారాయణ, స్వర్ణలత, నాలుగు మండలాలకు చెందిన పోలీసు, మండల పరిషత్, ఫిషరీస్, అటవీ శాఖ, పంచాయతీరాజ్, శాఖల అధికార్లు ఉద్యోగులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

భీమడోలు: భీమడోలు సెక్షన్ పరిధిలో సూరప్పగూడెం సబ్‌స్టేషన్ మరమ్మతుల కారణంగా ఈనెల 13వ తేదీ శనివారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏలూరు ఆపరేషన్లు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ జేపీబీ నటరాజన్ శుక్రవారం తెలిపారు. సూరప్పగూడెం విద్యుత్ సబ్‌స్టేషన్ 33/11కేవీ పరిధిలోని భీమడోలు, పోలసానిపల్లి, సూరప్పగూడెం, పాతూరు, లింగంపాడుకు మూడు గంటల పాటు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామన్నారు.

దెందులూరు: దెందులూరు విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో మరమ్మతుల నిమిత్తం శనివారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ జేపీబీ నటరాజన్ తెలిపారు. దెందులూరు, సత్యనారాయణపురం, కొత్తగూడెం, కొమిరేపల్లి, శింగవరం పరిధిలో విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తామని ఈఈ తెలిపారు.

గణపవరం మండలంలో..

గణపవరం: కాశిపాడు విద్యుత్ సబ్‌స్టేషన్ మరమ్మతుల కారణంగా ఈనెల 13వ తేదీ శనివారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ కాశిపాడు, చిలకంపాడు, చింతపల్లి, ముదునూరులో విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని విద్యుత్ శాఖ డీఈ వెంకటేశ్వరరావు తెలిపారు.

రైతులపై విద్యుత్ భారం మోపితే ప్రతిఘటిస్తాం

ఉంగుటూరు: రైతులపై విద్యుత్ భారం మోపితే ఏపీ రైతు సంఘం ప్రతిఘటిస్తుందని ఏపీ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వి.కృష్ణయ్య తెలిపారు. కైకరంలోని ప్రజాసంఘాల కార్యాలయంలో శుక్రవారం ఆయన మాట్లాడారు. ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్, జి.వెంకట కృష్ణారావు పాల్గొన్నారు.